manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 246 | గురువారం | 20.03.2025



రూ. 3,04,965 కోట్లతో

# రాష్ట్ర బడ్జెట్

## వ్యవసాయం, సంక్షేమానికి పెద్దపీట

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025–-26 వార్షిక బడ్జెట్‌ను సంక్షేమానికి పెద్ద పీటవేసింది. బుధవారం ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మొత్తం రూ. 3,04,965 కోట్లతో శాసనసభలో బడ్జెట్‌నుప్రవేశపెట్టారు. 2024-–25 తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,79,751 కోట్లు కాగా.. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లుగా ఉంది. మూల వ్యయం రూ.36,504 కోట్లుగా ఉంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది ఫిబ్రవరిలో తొలిసారిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అయితే ఈ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసింది. అన్ని సంక్షేమమే తమ ధ్యేయంగా ముందుకు సాగింది. రాష్ట్రంలో రైతులకే కాకుండా ఇతర రంగాల వారికి కూడా అధిక బడ్జెట్‌ను కేటాయించినట్లు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క తన ప్రసంగంలో వెల్లడించారు. మరి ఈ బడ్జెట్‌లో ఏ రంగానికి ఎంత బడ్జెట్ కేటాయించారో చూద్దాం..

## ఏ రంగానికి ఎంత బడ్జెట్?

- రెవెన్యూ విభాగంలో 10,954 గ్రామ స్థాయి పోస్టులు
- జనవరి 26 నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీప్రక్రియ మొదలు
- 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఇంటిగ్రేడెట్ స్కూల్స్
- హాస్టళ్లలో డైట్ చార్జీలు 40 శాతం, కాస్మొటిక్ చార్జీలు 200 శాతం పెంపు
- ఎకరానికి రైతుభరోసా రూ.12వేలు
- రైతు భరోసా రూ.18,000 కోట్లు.
- వ్యవసాయ రంగానికి రూ.24,439 కోట్లు
- రైతుకూలీ సంక్షేమానికి ఇందిరమ్మ ఆత్మీయభరోసా కింద రూ.12 వేలు
- సన్నవడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నాం..
- ఆయిల్‌పామ్ సాగు పెంచేందుకు సబ్సిడీలు
- త్వరలో 14,236 అంగన్‌వాడీల పోస్టుల భర్తీ
- గృహజ్యోతి పథకంతో 50 లక్షల కుటుంబాలకు లబ్ధి
- రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- నియోజకవర్గానికి కనీసం 3,500 ఇళ్ల నిర్మాణం
- హైదరాబాద్ నాలుగువైపులా శాటిలైట్ టౌన్‌షిప్‌లు
- రూ.2 లక్షలలోపు రైతురుణాలు మాఫీ చేశాం.
- 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్లు మాఫీ
- క్రీడలు రూ.465 కోట్లు
- అడవులు.. పర్యావరణం రూ.1,023 కోట్లు
- దేవదాయ శాఖ రూ.190 కోట్లు
- హోం శాఖ రూ.10,188 కోట్లు
- చేనేత రూ.371 కోట్లు
- మైనారిటీ సంక్షేమం రూ.3591 కోట్లు
- పరిశ్రమల శాఖ రూ.3,527 కోట్లు
- ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూ.774 కోట్లు
- విద్యుత్ శాఖ రూ.21,221 కోట్లు
- వైద్యం, ఆరోగ్యం రూ.12,393 కోట్లు
- మున్సిపల్ పట్టణాభివృద్ధి 17,677 కోట్లు
- నీటి పారుదల శాఖ రూ. 23,373 కోట్లు
- రోడ్లు, భవనాల శాఖ రూ. 5,907 కోట్లు
- పర్యాటక శాఖ రూ.775 కోట్లు
- ఎస్సీ సంక్షేమం రూ.40,232 కోట్లు
- ఎస్టీ సంక్షేమం రూ.17,169 కోట్లు
- బీసీ సంక్షేమం రూ.11,405 కోట్లు
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రూ. 31,605 కోట్లు
- మహిళా శిశుసంక్షేమం రూ.2,862 కోట్లు
- పశుసంవర్ధక శాఖ రూ.1,674 కోట్లు
- పౌరసరఫరాల శాఖ రూ.5,734 కోట్లు
- విద్యాశాఖ రూ.23,108 కోట్లు



## జవాబుదారీకి కేరాఫ్ కాంగ్రెస్

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



రాష్ట్రంలో

## అసమర్థ పాలన

- మాజీ మంత్రి కేటీఆర్

2



పన్నుల వసూళ్లలో

## నిర్లక్ష్యం వద్దు

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

3



విద్యార్థులు లక్ష్యసాధన

## కృషి చేయాలి

- సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

3

General News



# జవాబుదారీకి కేరాఫ్ కాంగ్రెస్

- **బీఆర్ఎస్ ఆర్థిక వ్యవస్థను భ్రష్టుపట్టించింది**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్, మన చౌరాస్తా:** 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర వార్షిక బడ్జెట్ ను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలంగాణ శాసన సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా.. పారదర్శకత, జవాబుదారీతనంతో తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సారానికి బడ్జెట్ ను ప్రవేశపెడుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాలల్లో రంగరించి జోడు గుర్రాల తరహాలో సుపరిపాలన రథాన్ని పరుగులు పెట్టించడంతో సఫలీకృతమయ్యామన్నారు. అంబేద్కర్ సూచనలను అనుసరిస్తూ ప్రజాపాలన చేస్తున్నామన్నారు. అధికారాన్ని హోదాగా భావించకుండా ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో విధ్వంస పాలన సాగిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక వ్యవస్థను భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. తమ ప్రభుత్వంపై నిరాధార విమర్శలు చేస్తున్నారని, సొంత మీడియాలో అబద్ధపు వార్తలతో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం తమ బాధ్యత అని చెప్పుకొచ్చారు. వరి బోనస్ కింద రూ.1,206 కోట్లు చెల్లించామన్నారు. ధాన్యం కొనుగోళ్లకు రూ.12,511 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. త్వరలో 14,236 అంగన్వాడీ పోస్టుల భర్తీ చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని తెలిపారు. విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చామని. విద్యావ్యవస్థ బలోపేతానికి యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని తీసుకొస్తున్నామన్నారు. 58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని.. కులమతాలతో సంబంధం లేకుండా ఇంటిగ్రేటెడ్ సూళ్లలో బోధన ఉంటుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఉండనున్నట్లు తెలిపారు. ప్రతి సాయంత్రం విద్యార్థులకు స్నాక్స్ పథకం అమలులోకి తీసుకొస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల కోసం రూ.11,600 కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి భట్టి వెల్లడిరచారు.

# రాష్ట్రంలో అసమర్థ పాలన సాగుతోంది

- **మాజీ మంత్రి కేటీఆర్**
- **ఎండిన వరితో అసెంబ్లీ ఎదుట నిరసన**



**హైదరాబాద్, మన చౌరాస్తా :**

సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థత పాలనతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణ నదిలో నీళ్లు సక్రమంగా వాడుకోలేక పంటలు ఎండబెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం, రేవంత్ రెడ్డి కళ్లు తెరిపించేందుకు ఎండిపోయిన వరితో నిరసన తెలుపుతున్నామన్నారు. సకాలంలో వర్షాలు పడ్డాయని.. కానీ ప్రాజెక్టుల్లో నీళ్లు నింపలేదని విమర్శించారు. మేడిగడ్డ ఎండబెట్టి సిగ్గులేకుండా ఇసుక అమ్మకాలు చేస్తోందని ఫైర్ అయ్యారు. 36 శాతం కృష్ణ జాలలు వాడుకోంది గత బీఆర్ఎస్ ప్రభుత్వం అని చెప్పుకొచ్చారు. కిందకి నీళ్లు వదిలి చంద్రబాబు మీద ప్రేమతో ఇక్కడ పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. వరి పంటల్లో మేకలు, గొర్రెలు మేస్తున్నాయన్నారు. దేవాదుల పంపులు ఆరు కోట్లు ఇస్తే నీళ్ళు వదిలే అవకాశం ఉండేదన్నారు. కానీ అందులో కమిషన్ రాదు కాబట్టి అవి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోందన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ విమర్శించారు. ఎక్కడెక్కడ లక్షల పంటలు ఎండిపోయాయో ఆ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి ఇతర బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# విద్యాశాఖకు బడ్జెట్ తగ్గించారు

**టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.చంద్రశేఖర్**



**జనగామ టౌన్, మ న చౌరాస్తా :** రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్ లో గత ఏడాది కంటే 0.20 శాతం తగ్గించారని టీఎస్‌యూటీఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ విద్యాశాఖకు మేనిఫెస్టోలో పేర్కొన్న 15 శాతం హామీకి ఆమడదూరంలో కేటాయింపు ఉన్నాయని విమర్శించారు. ఈసారి రూ.3,04,965 కోట్ల బడ్జెట్లో విద్యకు కేటాయించింది రూ23,108 కోట్లు (7.57 శాతం), గత సంవత్సరం రూ.27,4058 కోట్లు బడ్జెట్ లో విద్యకు కేటాయించింది రూ.21,292 కోట్లు (7.77 శాతం) అన్నారు. అంకెల్లో రూ.1,816 కోట్లు పెరిగినట్లుగా ఉన్నప్పటికీ శాతాల్లో చూస్తే గత సంవత్సరం కంటే తగ్గిందన్నారు. విద్యాశాఖ పరిధిలో ఉన్న 26,067 పాఠశాలలను గాలికొదిలేసి, రెసిడెన్షియల్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి మాత్రమే ప్రభుత్వం మాట్లాడుతోందన్నారు. నాణ్యమైన విద్యను అందించడానికి కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు.

# 21న కలెక్టరేట్ ముందు దీక్ష

**జనగామ టౌన్, మన చౌరాస్తా :** కాంగ్రెస్ పార్టీ గత శాసన సభ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా, వివిధ వేదికల్లో, వివిధ సందర్భాల్లో నాయకులు ఇచ్చిన హామీ మేరకు జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలనే డిమాండ్ తో గౌడ్ అన్నలు వివిధ గ్రామాల్లో బహుజనుల తో కలిసి కదం తొక్కుతున్నారు. ఈ నెల 21న జనగామ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే ఒక్కరోజు నిరాహార దీక్షకు భారీగా తరలి వచ్చేందుకు గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం చేస్తున్నారు. జిల్లా సాధన సమన్వయ కమిటీ నాయకులు అంబాల నారాయణ గౌడ్, వంగ సదానందం గౌడ్, గౌడ సంఘాల సమన్వయకర్త, సీనియర్ జర్నలిస్ట్ కన్న పరశురాములు, కార్యనిర్వాహక ప్రతినిధి అంబాల రఘునాథ్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నామాల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మెరుగు బాలరాజ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ దూడల సిద్దయ్య గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో ముమ్మర జన సమీకరణ జరుగుతోంది. ప్రస్తుత అధికార పార్టీ కాంగ్రెస్ గత శాసనసభ ఎన్నికల పార్టీ మేనిఫెస్టోలో జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెడతామని అధికారికంగా ప్రకటించారు. గౌడ బంధువులందరూ ఏకతాటిపై నిలిచి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సమాజంలోని బహుజనుల ను కూడగట్టుకొని గోల్కొండ నవాబులను ఎదిరించి నిర్మించిన కోటలు ఇప్పటికీ మన కళ్ళముందే కనిపిస్తున్నాయి. జనగామ జిల్లాలోని రఘునాథపల్లి మండలము ఖిలాషాపురం గ్రామంలో జన్మించిన సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ సాధారణ గీత కార్మికుడు. అటువంటి సాధారణ గీత కార్మికుడు దాదాపు మూడున్నర శాబ్దాల క్రితమే పాలకులను ఎదిరించి తిరగబడ్డ పులిబిడ్డ. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మిగతా ప్రాంతాలకు చెందిన చారిత్రాత్మకమైన వ్యక్తుల కంటే చరిత్రలో బంగారు అక్షరాలతో లిఖించదగ్గ వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. కానీ పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై, పాలకులపై తిరగబడ్డ పులి బిడ్డ కాబట్టి ఆయన చరిత్రను కనుమరుగు చేశారు. ఖిలేషాపురములో, మీదికొండలో, తాడికొండలో, భువనగిరిలో తదితర ప్రాంతాలలో ఆయన నిర్మించిన భారీ కోటలు మనకు కనిపిస్తూనే ఉన్నాయి. ఉడుము అనే ప్రాణికి తోకకు తాడు కట్టి వదిలేస్తే అది ఎంత పైకి పాకితే అంత పైన అక్కడ కోట నిర్మించిన ది శాలి పాపన్న గౌడ్. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో జిల్లాకు పేరు పెడతామని ప్రకటించడంతోపాటు హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహాలు నెలకొల్పుతామని, ఇతర హామీలు ఇచ్చారు. ఆ మేరకు గౌడ బంధువులందరూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. ఈనెల 21న జనగామలో చేపట్టే ఒకరోజు నిరాహార దీక్షకు గౌడ బంధువులతో పాటు ఇతర రాజకీయ పార్టీలు, బహుజనుల కు చెందిన కార్మిక సంఘాలు మద్దతు పలుకుతున్నట్లు గౌడ సంఘాల నాయకులు తెలిపారు.

# వంద శాతం పన్ను వసూలు చేయాలి

- ప్రత్యేక కార్యచరణతో ముందుకెళ్లండి
- నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మన చౌరాస్తా :** పన్ను వసూలు నిర్ణీత సమయంలో వంద శాతం పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను హెచ్చరించారు. పన్నుల వసూలుపై మున్సిపల్ కమిషనర్, ఆర్ ఓ, బిల్ కలెక్టర్, వార్డ్ ఆఫీసర్లతో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ బుధవారం జూమ్ మీటింగ్‌లో సమీక్షించారు. రోజుకు ఎన్ని గంటలు పన్ను వసూళ్లకు కేటాయిస్తున్నారు, ఎన్ని ఇల్లు తిరుగుతున్నారు, ఎంత టార్గెట్‌కు ఎంత వసూలు చేస్తున్నారు.. ఎంత మందికి డిమాండ్ నోటిసులు ఇచ్చారు అనే తదితర అంశాలపై క్షుణ్ణంగా కలెక్టర్ సమీక్షించారు. టాక్స్ కట్టని వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని తెలుసుకున్నారు. వంద శాతం ఆస్తి పన్ను వసూళ్లే లక్ష్యంగా మున్సిపల్ సిబ్బంది క్షేత్ర స్థాయి లో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పన్ను వసూళ్లలో పురోగతి కనపడకపోతే సహించేది లేదన్నారు.

## సజావుగా సాగుతున్న ఇంటర్ పరీక్షలు



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలో ఇంటర్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయి. సాంఘిక సంక్షేమ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల తీరును బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీ గదిలో పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించి విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల గురించి, పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సెంటర్లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఐఈవో జితేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు ఉన్నారు.



## విద్యార్థులు లక్ష్యసాధన కృషి చేయాలి


**– టెన్త్ విద్యార్థులతో సిద్దిపేట అదనపు కలెక్టర్**

**చేర్యాల, మన చౌరాస్తా :** విద్యార్థులు చదువులో ఉన్నత స్థాయిలో చేరుకోవాలంటే పదవ తరగతి కీలకమని, ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదివి లక్ష్యసాధనకు కృషి చేయాలని, చదువు ద్వారానే సమాజంలో గుర్తింపు లభిస్తుందని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. బుధవారం చేర్యాల మండల కేంద్రంలో కస్తూరిబా బాలికల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ టెన్త్ క్లాస్ విద్యార్థులకు కాసేపు పాఠాలు బోధించారు. విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శ్రద్ధతో చదవాలని, సిలబస్ లో ఎలాంటి సందేహాలు ఉన్నా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని, విద్యతోపాటు నైతిక విలువలను పెంపొందించుకోవాలని, సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతి రూములను, కిచెన్ ను సందర్శించి మెనూ ప్రకారమే నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. అనంతరం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో ఉన్న వైద్య సేవలపై ఆరా తీశారు. వార్డులలోని రోగుల వద్దకు వెళ్లి డాక్టర్లు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడి సెంటర్ ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట చేర్యాల తహసిల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో మహమూద్ అలీ, మున్సిపల్ కమిషనర్ ఎస్. నాగేందర్, డాక్టర్ దేవేందర్, ఆర్ ఐ రాజేందర్ రెడ్డి ఉన్నారు.

## హడలెత్తిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు

**బచ్చన్నపేట ,మన చౌరస్తా :** అసలే నీరు లేక అల్లాడుతున్న రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు మరింత తలనొప్పిగా మారాయి. భూగర్భ జలాలు లేక బోర్లు పోయక ఉన్నదాంట్లో అటు ఇటుగా నెట్టుకొస్తున్న రైతన్నలను ట్రాన్స్‌ఫార్లను దొంగలు ఆర్థికంగా నష్టపరుస్తున్నారు. మండల పరిధిలోని చిన్నరామచర్ల గ్రామ సమీపంలోని పుర్మ శ్రీనివాస్ రెడ్డి అనే రైతు చేనులో ఉన్న 25 కే.వి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఉంది. దీనిని పగలగొట్టి అందులోని కాపర్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. స్థానిక రైతు పుర్మ శ్రీనివాస్ రెడ్డి సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్ ఫార్మర్ పరిశీలించి, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. 15 రోజుల వ్యవధిలో దుండగులు పలు మార్లు చోరీలకు పాల్పడ్డారు. ఇలా వరుస చోరీలకు పాల్పడుతున్న దుండగులతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.





## హెచ్‌ఆర్‌ఏ కోసం వినతి

**జనగామ, మన చౌరాస్తా :** స్టేషన్ఘన్‌పూర్ పరిధిలో ఉద్యోగులకు 13 శాతం హెచ్‌ఆర్‌ఏ వర్తింపజేయాలి టీఎస్‌యూటీఎఫ్ జనగామ జిల్లా కార్యదర్శి మాడూరి వెంకటేష్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్టేషన్‌ఘన్‌పూర్ ను మున్సిపాలిటీగా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇచ్చి విషయం తెలిసిందే అన్నారు. ఆ నిబంధనల మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ తో పాటు చుట్టూ 8 కిలోమీటర్స్ పరిధిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు హెచ్‌ఆర్‌ఏ 13 శాతం వచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్టు వెంకటేష్ పేర్కొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమరవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన జిల్లా రాజయ్య ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్ రెడ్డి ఆ కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.5 వేలు అందించారు. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బోడిగే గురువయ్య గౌడ్, మకిలి కనకయ్య, బుడిగె రమేష్, కిషన్, ఉప్పరి సతీష్, మధ్య బోయిన సాయికుమార్, బచ్చల చంద్రం, గజ్జ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణ బిల్లు హర్షణీయం

**-మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్**



**జనగామ, మన చౌరాస్తా :** శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడం హర్షణీయమని జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్ అన్నారు. బుధవారం అయన మాట్లాడుతూ మాదిగల ఆర్థిక స్థితి గతులపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు ప్రకటించారని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచి మద్దతు పలుకుతున్నదని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి 2014లోనే ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయితే ప్రభుత్వ ఉద్యోగాల్లో, రాజకీయాల్లో అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఎస్సీ వర్గీకరణ ఆకాంక్ష నెరవేరడానికి మందకృష్ణ మాదిగ, పోరాట వీరులుగా నిలబడ్డ ఎమ్మార్పీఎస్ శ్రేణులకు, యావత్తు మాదిగ జాతికి, అండగా ఉన్న సమాజానికి ముసిపట్ల విజయ్ ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



# ఆ పాత్రలు వస్తే మార్చుకుంటా..

## షాలినీ పాండే

'అర్జున్‌రెడ్డి' సినిమాలో కథానాయిక షాలినీ పాండే పోషించిన 'ప్రీతి' పాత్రను ఇష్టపడని ప్రేక్షకుడు ఉండడు. ఓ విధంగా ఆ సినిమా విజయంలో ఆ పాత్ర ప్రభావం చాలా ఉంది. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయి పాత్ర షాలినీకి రాలేదనే చెప్పాలి. అయితే.. రీసెంట్‌గా ఆమె 'డబ్బా కార్టెల్' వెబ్ సిరీస్‌లో నటించారు. ఆ సిరీస్ ఓటీటీలో పెద్ద హిట్. అందులో బలమైన మహిళగా కనిపించి, ప్రశంసలందుకుంటున్నది షాలినీ పాండే. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'మరోసారి 'అర్జున్‌రెడ్డి' లాంటి సినిమాలో ప్రీతి తరహా పాత్ర చేయాల్సివస్తే చేస్తారా?' అని ఓ విలేకరి అడగ్గా.. 'నేను కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో చేసిన సినిమా అది. ఇప్పుడు ఆ పాత్ర గురించి ఆలోచిస్తే అమాయకంగా అనిపిస్తుంది. ఆ పాత్రను ఇంకాస్త బలంగా రాయొచ్చేమో అనుకుంటున్నా. మరోసారి ఆ తరహా పాత్ర వస్తే చేయనని చెప్పను కానీ.. దర్శకుడితో మాట్లాడి కొన్ని మార్పులు చేయించుకొని అప్పుడు చేస్తా. అంతేకాదు, అప్పటికంటే ఇప్పుడు నటిగా పరిణితి చెందాను కాబట్టి ఇంకాస్త భిన్నంగా చేయడానికి ప్రయత్నిస్తా.' అంటూ చెప్పుకొచ్చింది షాలినీ పాండే.